http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

సోమవారం 17 ఫిబ్రవరి 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# 'స్థానిక' కసరత్తు

## పోలింగ్ కేంద్రాల గుర్తింపు.. ప్రచురణ

## ఎన్నికలెప్పుడు వచ్చినా... సంసిద్ధమైన పీఆర్, ఎస్ఈసీ

## ఎన్నికలు వాయిదా పడుతున్నాయనే భావనలో ఉండొద్దని, ఆయా పనులకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తూనే ఉండాలని అధికారులు, సిబ్బందికి ఆదేశాలు

హైదరాబాద్:

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మరో మూడు నెలల సమయం పట్టే అవకాశమున్నా, ఎన్నికల పనుల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) పూర్తిస్థాయిలో నిమగ్నమైంది. శనివారం జిల్లాలు, మండల స్థాయిలో పోలింగ్ కేంద్రాలను గుర్తించి దానికి సంబంధించిన జాబితాలను జిల్లా, మండల కేంద్రాల్లో ప్రచురించారు. రాష్ట్రవ్యాప్తంగా 570 జెడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీ స్థానాల్లో పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు ప్రకటించారు. మరోవైపు ఓటర్ల జాబితాకు సంబంధించిన కసరత్తు సాగుతోంది. ఎన్నికలు వాయిదా పడుతున్నాయనే భావనలో ఉండొద్దని, ఆయా పనులకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తూనే ఉండాలని అధికారులు, సిబ్బందికి పంచాయతీరాజ్ కమిషనరేట్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, సిబ్బందికి శిక్షణ తదితరాలన్నీ పూర్తిచేసి, ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్ వచ్చినా వెంటనే ఎన్నికల విధుల్లో దిగేందుకు సిద్ధంగా ఉండాలని ఈ ఆదేశాల్లో స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఎన్నికల ఏర్పాట్లపై జెడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఇతర క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌లు, గూగుల్‌మీట్‌లు నిర్వహిస్తూనే ఉన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఎస్ఈసీ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా పీఆర్ శాఖ ద్వారా పోలింగ్ కేంద్రాల జాబితా, - మిగతా3లో



## ఢిల్లీ కొత్త సీఎంపై నిరీక్షణకు తెర..



- బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం ఫిక్స్
- ఢిల్లీ కొత్త సీఎం ఖరారు నేడే!
- రేసులో ముందున్న యువనేత
- ఇప్పటికే చర్చోపచర్చలు సాగిస్తోన్న హైకమాండ్

## భారత్‌కు అమెరికా భారీ షాక్!

- భారత్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాలకు అందించే మిలియన్ డాలర్ల నిధుల్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటన
- అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ శాఖ ప్రపంచ కుబేరుడు ఎలోన్ మస్క్ నిర్వహణలో ఉంది
- ప్రధాని మోదీ గతవారం అమెరికాలో పర్యటించారు.



## గుడ్డెద్దు చేనులో పడినట్లుగా

# కాంగ్రెస్ పాలన ఉంది

### బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై కిషన్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్

### సీఎం రేవంత్ రెడ్డి మాటలతోనే పబ్బం గడుపుతున్నారు


### బయ్యారం ఐరన్ ఓర్‌లో క్వాలిటీ లేదు

### బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై తాము ఎలాంటి హామీ ఇవ్వలేదు



హైదరాబాద్

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ కులమేంటీ..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ప్రభుత్వాలు ఒకేతాను ముక్కలని ఆరోపించారు. ఆదివారం వరంగల్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. గుడ్డెద్దు చేనులో పడినట్లుగా కాంగ్రెస్ పాలన ఉందని ఆక్షేపించారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలతోనే పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో దయనీయ పరిస్థితి నెలకొందని అన్నారు. కులగణనకు బీజేపీ మద్దతు - మిగతా3లో



## కూలిన బతుకులు!

- 42 మంది కార్మికులను చిదిమేసిన బంగారు గని
- ఆఫ్రికా దేశం మాలిలో దుర్ఘటన
- ఒక్కసారిగా విరిగిపడిన కొండచరియలు
- తప్పించుకునేలోపే మృత్యువాత పడిన కార్మికులు

## అధికారుల ఆలోచన విధానంలో

# మార్పు రావాలి

- రాజకీయ నాయకులను గైడ్ చేసే విధానం అప్పట్లో ఉండేది
- ఇప్పుడు ఎందుకు అలా లేదో తెలియడం లేదు
- రాజకీయ నాయకులకు అవగాహన కల్పించే సెక్రటేరియట్ రూల్స్ ఉన్నాయి
- కొత్తగా సెలెక్ట్ అయిన కొందరు ఐపీఎస్‌లు తప్పుడు మార్గంలో నడుస్తున్నారు
- ఐఏఎస్, ఐపీఎస్‌లపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణ రచించిన 'లైఫ్ ఆఫ్ కర్మయోగి' పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాల జ్ఞాపకాలను పుస్తక రూపంలో తీసుకుని రావడం బిగ్ టాస్క్ అన్నారు. కొత్తగా ఐఏఎస్‌గా వచ్చే వాళ్లకు గోపాలకృష్ణ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

చాలా మందికి కొంత మంది సీనియర్ ఐఏఎస్‌ల గురించి ఇప్పటికి తెలీదు.. శేషన్ ఐఏఎస్.. ఎన్నికల కమిషన్ ఉందని తట్టి లేపిన గొప్ప వ్యక్తి. రాజకీయ నాయకులను గైడ్ చేసే విధానం అప్పట్లో ఉండేది. ఇప్పుడు ఎందుకు అలా లేదో తెలియడం లేదు. రాజకీయ నాయకులకు అవగాహన కల్పించే సెక్రటేరియట్ రూల్స్ ఉన్నాయి. కొత్తగా సెలెక్ట్ అయిన కొందరు ఐపీఎస్‌లు తప్పుడు మార్గంలో నడుస్తున్నారు." అంటూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. "కొత్త ఐపీఎస్‌లు యూనిఫామ్ వేసుకొని సివిల్ పంచాయితీలు చూసుకోవడం దురదృష్టకరం. ఏసీ రూమ్ నుంచి - మిగతా3లో

# అమ్మ ఆస్తులు.. పూర్తయిన అప్పగింతలు






**బెంగళూరు :** తమిళనాడు మాజీ సీఎం, ప్రముఖ సినీ నటి జయలలితకు సంబంధించిన ఆస్తులు, ఆస్తి పత్రాలను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అందించే ప్రక్రియ శనివారం పూర్తయిందని కర్ణాటక ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిరణ్ జవళి వెల్లడించారు. ఈ కేసు విచారణకు ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు, ఆస్తులను భద్రపరచడంతోపాటు సిబ్బంది నియామకం తదితర అంశాలకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.13 కోట్లు కర్ణాటకకు అందాయని తెలిపారు. జయలలితకు చెందిన 27 కిలోల బంగారంతోపాటు వజ్రాభరణాల్లో 1.5 కిలోల పుత్తడి కత్తి సైతం ఉందని వివరించారు. ఇక పొలాలు, నివాసాలకు సంబంధించిన దస్తావేజులతోపాటు11,300 పట్టు చీరలు, 250 శాలువాలు, 12 రిఫ్రిజిరేటర్లు, 10 టీవీలు, 8 వీసీఆర్‌లు, 740 జతల పాదరక్షలు, 610 వెండి వస్తువులు, 27 కిలోల బంగారు ఆభరణాలు ఆ జాబితాలో ఉన్నాయని వివరించారు. 7,040 గ్రాముల 468 వజ్రఖచిత బంగారు ఆభరణాలతో కలిపి మొత్తం 1606 వస్తువులను ట్రంకు పెట్టెల్లో తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైందని చెప్పారు. శనివారానికి ఆ రాష్ట్ర అధికారులు సరిచూసుకోవడంతో న్యాయసంబంధ వ్యవహారం పూర్తయిందని తెలిపారు. తమిళ ప్రజల ఆరాధ్య దైవం అమ్మగా జయలలిత ఖ్యాతి పొందారు. 2016 డిసెంబర్‌లో ఆమె తీవ్ర అనారోగ్యంతో చెన్నై అపోలో ఆసుపత్రిలో మరణించారు. అయితే పలుమార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా పని చేశారు. అక్రమాస్తుల కేసులో ఆమె జైలుకు సైతం వెళ్లారు. ఆమె పాలనలో ఈ కేసులపై ప్రభావం చూపే అవకాశముందని డీఎంకే భావించింది. అందులో భాగంగా ఈ కేస్ను కర్ణాటకలోని పరప్పన్ అగ్రహారానికి బదిలీ చేశారు. నాటి నుంచి ఈ కేసు అంతా అక్కడి న్యాయ స్థానంలోనే సాగింది. అయితే జయలలిత ఆస్తులు తమకు చెందాలంటూ.. ఆమె వారసులం తామేనంటూ పలువురు బంధువులు న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు. కానీ జయలలిత ఆస్తులు తమిళనాడు ప్రభుత్వానికి చెందాలంటూ న్యాయస్థానం స్పష్టమైన తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో పరప్పన్ అగ్రహారంలోకి న్యాయ స్థానంలో ఉన్న ఆమెకు సంబంధించిన స్థిర, చర ఆస్తులకు.. ఆరు ట్రంక్ పెట్టల మధ్య తమిళనాడు అధికారులకు.. కర్ణాటక న్యాయ స్థానం.. ఆ రాష్ట్ర ఉన్నతాధికారుల సమక్షంలో అందజేశారు. భారీ భద్రత నడుమ జయలలిత ఆస్తులను తమిళనాడుకు తరలించారు.

## రైళ్లు రద్దు కాలేదు, ఫ్లాట్‌ఫాం మార్చలేదు...

# తొక్కిసలాటపై రైల్వే శాఖ వివరణ




**న్యూఢిల్లీ:** రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రయాణికులు మరణించానికి దారితీసిన కారణాలపై భిన్న కథనాలు వినిపిస్తుండటంపై రైల్వే శాఖ వివరణ ఇచ్చింది. ఏ ఒక్క రైలును రద్దు చేయలేదని, ఫ్లాట్‌ఫాం మారుస్తున్నట్టు ఎలాంటి ప్రకటన కూడా చేయలేదని తెలిపింది. ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు 14వ నెంబర్ ఫ్లాట్‌ఫాం మీదకు భారీ సంఖ్యలో ప్రయాణికులు గుమిగూడటంతో ఊహించని విధంగా తొక్కిసలాట చోటుచేసుకుందని నార్తరన్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి హిమాన్షు శేఖర్ ఉపాధ్యాయ్ తెలిపారు. "షెడ్యూల్డ్ రైళ్ల ఫ్లాట్‌ఫాంలను మారుస్తూ మేము ఎలాంటి ప్రకటన చేయలేదు. రైళ్లను కూడా రద్దు చేయలేదు. నిజానికి రద్దీకి అనుగుణంగా సాయంత్రం సమయంలో 5 నుంచి 6 ప్రత్యేక రైళ్లు కూడా వేశాం" అని ఉపాధ్యాయ్ తెలిపారు. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌కు పెద్దఎత్తున ప్రయాణికులు తరలివస్తుండటంతో ఢిల్లీ నుంచి ప్రయాగరాజ్‌కు 350 నుంచి 400 రైళ్లు నడుపుతున్నామని చెప్పారు. అయితే ప్రమాద (తొక్కిసలాట) సమయంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఫ్లాట్‌ఫాం 14 నుంచి 12కు ఫుట్‌బ్రిడ్జి మీదుగా కదులుతుండటంతో అనూహ్యంగా తొక్కిసలాట చోటు చేసుకుందన్నారు. కాగా, ఫ్లాట్‌ఫాం 14, 15కు దారితీసే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మెట్ల మీద నుంచి ఒక ప్రయాణికుడు జారి పడటం, వెనుకనున్న వాళ్లు అతనిపై పడటంతో ఒక్కసారిగా పరిస్థితి అదుపుతప్పిందని, ఘోర విషాదం చోటుచేసుకుందని రైల్వే అధికారులు తెలిపారు. రైళ్లు బయలుదేరడంలో జరిగిన జాప్యం, ప్రతి గంటకు 1,500 టిక్కెట్ల అమ్మకాలతో రైల్వేస్టేషన్ వద్ద విపరీతమైన రద్దీ నెలకొని ప్రయాణికుల్లో గందరగోళం నెలకొన్నట్టు మరికొన్ని వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, తొక్కిసలాట ఘటనపై అత్యున్నత స్థాయి దర్యాప్తునకు రైల్వే శాఖ ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన కమిటీ రైల్వే స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌లను, ఇతర డాక్యుమెంట్లను పరిశీలిస్తోంది. త్వరలోనే నివేదికను సమర్పించనుంది. దీనితో పాటు మృతుల కుటుంబాలకు రైల్వే శాఖ రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్ష చొప్పున పరిహారం ప్రకటించింది.

# భారత్‌కు అమెరికా భారీ షాక్!



భారత ప్రధాని నరేంద్రమోదీ అమెరికా పర్యటన అలా ముగించి ఇలా వచ్చారో లేదో.. భారత్‌కు ట్రంప్ భారీ షాకిచ్చారు. భారత్, బంగ్లాదేశ్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాలకు అందించే మిలియన్ డాలర్ల నిధుల్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ శాఖ బాధ్యతలను ప్రపంచ కుబేరుడు ఎలోన్ మస్క్ నిర్వహిస్తున్నారు. ఎలోన్ మస్క్ సూచన మేరకు ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని మోదీ గతవారం అమెరికాలో పర్యటించారు. పర్యటన సమయంలో ఇద్దరు నేతలు అమెరికా-భారత్ సంబంధాలను బలోపేతం చేసేలా ముఖ్యమైన ప్రకటనలు చేశారు. ఈ తరుణంలో ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచడానికి కేటాయించే 21 మిలియన్ల డాలర్లను, బంగ్లాదేశ్ రాజకీయాల్ని బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన 29 మిలియన్ల డాలర్ల మొత్తాన్ని తగ్గించాలని అమెరికా నిర్ణయించినట్లు ఎలోన్ మస్క్ ప్రభుత్వ సామర్థ్య విభాగం డోజ్ ఆదివారం ప్రకటించింది. ఇదే విషయాన్ని డోజ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. కాగా, డొనాల్డ్ ట్రంప్‌ని ప్రధాని మోదీని కలిసిన కొద్ది రోజులకే ఈ ప్రకటన రావడం గమనార్హం. మరోవైపు బంగ్లాదేశ్‌లో, రాజకీయ స్థిరత్వాన్ని పెంపొందించడానికి, ప్రజాస్వామ్య పాలనను మెరుగుపరచడానికి రూపొందించిన కార్యక్రమంలో భాగంగా అమెరికా ఆదేశానికి 29 మిలియన్ డాలర్లను కేటాయిస్తుండేది. తాజాగా ఆ నిధుల కేటాయింపుల్ని ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. హింసాత్మక నిరసనల మధ్య షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని సైన్యం గద్దె దించడంతో దేశం రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. హసీనా భారత్‌కు వచ్చిన తర్వాత మొహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఇప్పుడు దేశాన్ని పాలిస్తున్నప్పటికీ, రాజకీయ అస్థిరత కొనసాగుతోంది. అమెరికా ప్రభుత్వం తన విదేశాంగ విధాన వ్యూహాల్లో భాగంగా వివిధ దేశాలలో ప్రజాస్వామ్యం, పాలన కార్యక్రమాలకు తరచుగా నిధులు సమకూరుస్తుంది. అలా భారత్‌లో ఓటింగ్ శాతం పెరగడానికి డబ్బు ఖర్చు చేస్తుంది. తద్వారా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకుంటుంది. భారత్‌లాంటి ప్రజాస్వామ్య దేశాల్ని ప్రోత్సహించడం ద్వారా చైనా వంటి దేశాల ప్రభావాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.

## ఈ తప్పు మరో చోట జరగకూడదు.. ఢిల్లీ తొక్కిసలాట తర్వాత ఆ పని చేస్తున్న రైల్వే శాఖ..



ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో ఎంతమంది తమ అయినవారిని కోల్పోయారో తెలియదు. ప్రస్తుతం, తొక్కిసలాట ఎలా జరిగింది. ఏ నిర్లక్ష్యం వల్ల ఈ దుర్ఘటన జరిగిందనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తొక్కిసలాటలో ఉన్న వారిలో 90 శాతం మంది మహా కుంభమేళా కోసం ఢిల్లీ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న వారే. ఇప్పటికే మహాకుంభమేళా చుట్టుపట్ల వేలాది వాహనాలు నిలిచిపోయాయి. 15 నిమిషాలు వెళ్లాల్సిన దూరానికి కూడా దాదాపు 3 గంటలు పడుతోంది. ఇంత ట్రాఫిక్ ఉన్నప్పటికీ భక్తుల రద్దీ పెరుగుతుందే తప్ప తగ్గటం లేదు. త్రివేణి సంగమంలో భక్త సంద్రాన్ని నియంత్రించేందుకు యూపీ ప్రభుత్వం ఒక పక్క చర్యలు తీసుకుంటుంటే, మరో పక్క రైల్వే శాఖ కూడా అప్రమత్తమైంది. గత నెల జనవరి 13న ప్రారంభమైంది మహాకుంభమేళాలో ఇప్పటివరకూ 50 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నాలు చేశారు. ఫిబ్రవరి 26 చివరిరోజు కావడంతో ప్రయాగ్‌రాజ్‌కు జనప్రవాహం ఆగటం లేదు. వేలాది వాహనాలు త్రివేణి సంగమం వైపు కదలుతున్నాయి. దీంతో ప్రయాగ్‌రాజ్ పొరుగు నగరాల్లోనూ భారీ ట్రాఫిక్ నెలకొంది. ప్రయాగ్‌రాజ్ సరిహద్దులో ఉన్న మధ్యప్రదేశ్‌లోని రేవాలో కూడా వాహనాల సంఖ్య గత 24 గంటల్లో విపరీతంగా పెరిగింది. ఢిల్లీ రైల్వేస్టేషన్లో తొక్కిసలాట ఘటనలో శనివారం 18 మంది చనిపోవడంతో ట్రాఫిక్ మరింత పెరిగింది. దీంతో ఉత్తరప్రదేశ్, బీహార్‌లోని వివిధ రైల్వే స్టేషన్లలో అలర్ట్ ప్రకటించారు. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ మహా కుంభమేళా వ్యవధిని పొడిగించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. గత సంవత్సరాల్లో మహా కుంభమేళా 75 రోజులు కొనసాగిందని, ప్రస్తుత షెడ్యూల్ తక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు. రోడ్లపై అధిక సంఖ్యలో భక్తులు ఉన్నారని వారందరికీ పుణ్యస్నానాలు స్నానాలు చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

### కూలిన బతుకులు!



ఓ బంగారు గని కుప్పకూలిన ఘటన ఆఫ్రికా దేశం మాలిలో చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 42 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మాలి దేశంలోని తూర్పు ప్రాంతంలో ఉన్న ఈ గని కొందరు చైనా జాతీయులు నిర్వహణలో ఉంది. ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడడంతో కార్మికులు తప్పించుకోలేకపోయారు. కొన్ని రోజుల వ్యవధిలోనే మాలి దేశంలో జరిగిన రెండో ప్రమాదం ఇది. గత నెల 29న కౌలికోరో ప్రాంతంలో ఉన్న ఓ బంగారు గని కూలిపోయిన ఘటనలోనూ ప్రాణనష్టం జరిగింది. మాలి దేశం ఆఫ్రికాలోని మూడో అతి పెద్ద బంగారం ఉత్పత్తిదారుగా ఉంది. ఇక్కడి జనాభాలో 10 శాతం కంటే ఎక్కువమంది గనులపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నారు. గతేడాది కూడా మాలిలో ఓ బంగారు గని కుప్పకూలి 70 మంది మృత్యువాతపడ్డారు. ఇక్కడి గనుల్లో చాలా వరకు అనుమతులు లేనివే ఉంటాయని తెలుస్తోంది.

### మహాకుంభమేళాపై లాలూ ప్రసాద్ యాదవ్




### సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** మహాకుంభమేళాపై ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మహాకుంభమేళాకు అసలేమైనా అర్థం..పర్థం ఉందా..?అది ఓ అర్థం లేని వ్యవహారం' అని లాలూ అన్నారు. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది దుర్మరణం చెందడం దురదృష్టకరమని వ్యాఖ్యానించే సందర్భంలో లాలూ మహా కుంభమేళాపై ఈ వ్యాఖ్యలు చేశారు. రైల్వేశాఖ విఫలమవడం వల్లే న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగిందన్నారు. రైల్వే మంత్రి దీనికి పూర్తిగా బాధ్యత వహించాల్సిందేనన్నారు.అయితే మహాకుంభమేళాపై లాలూ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు విరుచుకుపడుతున్నారు. ఈ వ్యాఖ్యలు హిందువులపై ఆర్జేడీ వైఖరిని స్పష్టం చేస్తున్నాయని బీహార్ బీజేపీ చీఫ్ మనోజ్‌శర్మ అన్నారు. బిహార్ ఎన్నికలు వస్తున్న వేళ ఓ వర్గం వారిని బుజ్జగించేందుకే లాలూ మహాకుంభమేళాను టార్గెట్ చేశారని శర్మ మండిపడ్డారు.




### ఢిల్లీ కొత్త సీఎంపై నిరీక్షణకు తెర

న్యూఢిల్లీ:ఢిల్లీ కొత్త సీఎం ఎవరన్నదానిపై సస్పెన్స్‌కు తెరపడనుంది. సీఎం పేరును సోమవారం(ఫిబ్రవరి17) జరిగే బీజేపీ కీలక నేతల భేటీలో ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ సీఎంగా ఎవరిని నిర్ణయించాలన్నదానిపై బీజేపీ హైకమాండ్ ఇప్పటికే చర్చోపచర్చలు సాగిస్తోంది. దీనిపై పార్టీ ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే సీఎం ఎవరన్నది బయటికి పొక్కకుండా బీజేపీ నేతలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ఈ విషయంపై ఎవరూ నోరు విప్పకుండా అధిష్టానం స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు చెబుతున్నారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌పై విజయం సాధించిన పర్వేష్‌వర్మకే ఢిల్లీ సీఎంగా ఎక్కువ అవకాశాలున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. పర్వేష్‌వర్మతో పాటు ఢిల్లీ మాజీ ప్రతిపక్షనేత విజేందర్‌గుప్తా, ఢిల్లీ బీజేపీ మాజీ చీఫ్ సతీష్ ఉపాధ్యాయ,ఢిల్లీ బీజేపీ జనరల్ సెక్రటరీ ఆశిష్ సూద్,ఆర్‌ఎస్‌ఎస్ నేత జితేంద్ర మహాజన్ పేర్లు సీఎం రేసులో పరిశీలనలో ఉన్నాయి. కాగా, ఫిబ్రవరి 5న జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీపార్టీపై బీజేపీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ గెలుపుతో 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో బీజేపీ అధికారం చేపట్టనుంది. కాగా, ఢిల్లీ సీఎం ఎవరనే సస్పెన్స్‌కు మరో 2-3 రోజుల్లో తెరపడే అవకాశం ఉందని బీజేపీ ఎంపీ యోగేంద్ర చందోలియా శనివారంనాడు తెలిపారు. ఒకటి రెండ్రోజుల్లో కీలకమైన పార్లమెంటరీ సమావేశం జరుగుతుందని, అనంతరం దీనిపై స్పష్టత వస్తుందని తెలిపారు. దాదాపు 27 ఏళ్ల నిరీక్షణకు తెరపడి ఫిబ్రవరి 5న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగురవేసింది. 70 అసెంబ్లీ స్థానాల్లో 48 స్థానాలను బీజేపీ గెలుచుకోగా, గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని హవా సాగించిన ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితమైంది. ఆ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు పలువురు కీలక నేతలు ఓటమి చవిచూడగా, మాజీ ముఖ్యమంత్రి అతిషి మాత్రం తన సీటును నిలబెట్టుకున్నారు.

### బెంగళూరులో దారుణం.. టోల్‌గేట్ వద్ద అరాచకం!

**బెంగళూరు:** కర్ణాటకలోని బెంగళూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. టోల్‌గేట్ వద్ద ఓ వ్యక్తిని కారు కొంత దూరం లాకెళ్లి పడేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. కర్ణాటకలోని నెలమంగళలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. టోల్‌బూత్ వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య వాగ్వాదం జరిగింది. టోల్‌గేట్ వద్ద ఓ కారును మరో కారు ఓవర్ టేక్ చేయడంతో సదరు కారులో? వ్యక్తి.. ముందుకు వచ్చి కారులో ఉన్న వ్యక్తిని ప్రశ్నించారు. దీంతో, టోల్‌బూత్‌లో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో ముందు కారులో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి ఆవేశంతో రగిలిపోయాడు. ఈ క్రమంలోనే కారు స్టార్ చేసి.. వాగ్వాదానికి దిగిన వ్యక్తి కాలర్ పట్టుకుని కారును ముందుకు నడిపాడు. ఆ తర్వాత కారు ఆ వ్యక్తిని దాదాపు 50 మీటర్ల దూరం కారు ఈడ్చుకెళ్లింది. కొంత దూరం వెళ్లాక అతడిని వదిలిపెట్టడంతో ఆయన కిందపడిపోయాడు. కారు డ్రైవర్ మాత్రం ఆగకుండా వెళ్లిపోయాడు. ఇక, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై పోలీసులు

# తస్మాత్ జాగ్రత్త.. అలా చేస్తే అస్సలు స్పందించకండి




హైదరాబాద్: పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్న ఏదో ఒక ప్రాంతంలో ప్రజలు మోసపోతునే ఉన్నారు. సైబర్ కేటుగాళ్ల చేతిలో పడి రూ.లక్షల్లో తమ కష్టార్జితాన్ని పోగొట్టుకుంటున్నారు. సామాన్యుల నుంచి ప్రభుత్వ అధికారుల వరకు మోసగాళ్ల వలలో చిక్కి భారీగా నష్టపోతున్నారు. కేటుగాళ్ల పట్ల ఎన్ని చర్యలు తీసుకుంటున్న మళ్లీ మళ్లీ ఏదో ఒక రూపంలో మోసాలకు పాల్పడుతునే ఉన్నారు. తాజాగా యాదాద్రి జిల్లాలో ఓ ఎమ్మార్వోకు ఏసీబీ అధికారిని అంటూ ఓ కేటుగాడు కుచ్చుటోపీ పెట్టాడు. అవినీతికి పాల్పడుతున్నావ్ అంటూ మోసగాడు డబ్బులు డిమాండ్ చేశాడు. అరెస్టు చేయకుండా ఉండాలంటే తాను చెప్పిన ఖాతాలో డబ్బులు వేయాలని బెదిరించాడు. డబ్బులు వేస్తే ఏం పట్టించుకోమని నమ్మబలికాడు. ఎమ్మార్వో భయపడిపోయి కేటుగాడు చెప్పిన ఖాతాల్లో డబ్బులు వేశాడు. సుమారుగా రూ. 3 లక్షల 30 వేలను ఆన్‌లైన్ ద్వారా ఎమ్మార్వో దామోదర్ బదిలీ చేశారు.

**ఏసీబీ డీజీ కీలక సూచనలు..**

అయితే, ఏసీబీ పేరుతో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యవహారంపై ఏసీబీ డీజీ స్పందించారు. ప్రభుత్వ ఉద్యోగులపై కేసులు నమోదు చేయకుండా ప్రైవేట్ వ్యక్తులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఏసీబీ పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడిన వెంటనే ఏసీబీకి, లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. మీపై కేసు లేకుండా చూస్తామంటూ డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారు.

**నకిలీ కాల్స్ నమ్మొద్దు..**

అలాంటి నకిలీ కాల్స్‌ను నమ్మవద్దని అన్నారు. ఏసీబీ అధికారుల పేరుతో ప్రభుత్వ ఉద్యోగులు లేదా సామాన్యులకు అలాంటి ఫేక్ కాల్స్ వస్తే టోల్ ఫ్రీ నెంబర్1కు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064ను సంప్రదించాలని చెప్పారు. ఏసీబీ తెలంగాణ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లో కూడా వాట్సాప్, ఫేస్ బుక్, ఎక్స్ ద్వారా కూడా ఫిర్యాదు చేమొచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుడు, బాధితుడి పేరు, వివరాలు రహస్యంగా ఉంచుతామని ఏసీబీ డీజీ పేర్కొన్నారు.

## నదీ జలాలను ఏపీ తన్నుకుపోతుంటే రేవంత్ సర్కారులో చలనం లేదు



తెలంగాణకు దక్కాల్సిన నదీ జలాలను ఏపీ తన్నుకుపోతుంటే రేవంత్ రెడ్డి సర్కారులో చలనం లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా రోజుకు 10 వేల క్యూసెక్కుల నీటిని ఏపీ తరలించుకుపోతోందని ఆరోపించారు. గత మూడు నెలలుగా ఈ తంతు జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం తమాషా చూస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాడు కేసీఆర్ గోదావరి, కృష్ణా జలాల్లో ప్రతి బొట్టును కూపాడుకుంటూ బీడు భూములను సస్యశ్యామలంగా మార్చారని... కానీ కాంగ్రెస్ పార్టీ ఏడాది కాలంలోనే పంట పలాలను బీడుగా మార్చేసిందని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు ప్రాతిపదికన తెలంగాణ ఏర్పడిందని... అలాంటి రాష్ట్రంలో ఒక్కొక్కటిగా అన్నింటినీ రేవంత్ సర్కారు నాశనం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కృష్ణా జలాల నుంచి 646 టీఎంసీల నీటిని వినియోగించుకున్నా, కాంగ్రెస్ సర్కారు అడ్డుకోవడంలేదని ఆగ్రహం వెలిబుచ్చారు.

## 'స్థానిక' కసరత్తు

-మొదటిపేజీ తరువాయి

ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. పైగా సిబ్బందికి కూడా దీనికి సంబంధించిన శిక్షణను కూడా పూర్తి చేసింది. శనివారం పోలింగ్ స్టేషన్లు ఖరారు కావడంతో టీ%-%పోల్ యాప్‌లో పోలింగ్ కేంద్రాల వారీగా 500 నుంచి 700 ఓటర్లను మ్యాపింగ్ చేసి ఆయా కేంద్రాలకు కేటాయించాల్సి ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్లు ఇతర అంశాలకు సంబంధించి హైకోర్టులోనూ కేసు విచారణ సాగుతున్న విషయం తెలిసిందే. కోర్టుకు ఆయా విషయాలపై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని, జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పీఆర్ శాఖ ఆదేశించింది. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఏవి ముందు నిర్వహించాల్సి వచ్చినా, అందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమై ఉండాలని సూచించింది.

కులగుణనలో రెండోవిడతలో వివరాల సేక రణ, పరిశీలన, ఆపై కేబినెట్ భేటీలో సమగ్ర నివేదిక ఆమోదం, ఆపై అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు చట్టబద్ధత కల్పించేలా బిల్లు పెట్టి కేంద్రానికి, పార్లమెంట్‌కు పంపించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు మరికొన్ని నెలల సమయం పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారు



సిద్దిపేట జిల్లా: పార్లమెంటు ఎన్నికల్లో మూడో సారి నరేంద్ర మోదీకి ప్రజలు అధికారం కట్టబెట్టారని, ప్రతిపక్షాల తీరు పార్లమెంటో విచిత్రంగా ఉందని ప్రజానీకం అంతా ఒకటే భావనతో అన్నారని మల్కాజ్ గిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా, గజ్వేల్ పట్టణంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశం సుభిక్షంగా ఉండాలన్నా, ఆర్థికంగా, బలంగా ఉండాలన్నా, ప్రపంచంలో దేశం సగౌరవంగా ఉండాలంటే మోదీ ప్రధానిగా ఉండాలనేది ప్రజలకు తెలుసునని అన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 44 శాతం వస్తే.. బీజేపీకి 30 శాతం ఓట్లు వచ్చాయన్నారు. ఇప్పుడు తెలంగాణలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు మోదీని ఆశీర్వదించే విధంగా కనిపిస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. ఉపాధ్యాయులకు అండగా కొట్లాడిన పార్టీ బీజేపీ అని, టీచర్ల విషయంలో, మధ్యతరగతి వారి విషయంలో బీజేపీ కృషిచేసిందని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య దేశంలో నే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తాండవిస్తోందని, ప్రపంచం లో 11 వ ఆర్థిక వ్యవస్థలో ఉన్న భారత్ మోదీ కృషితో 5 వ స్థానానికి వచ్చిందన్నారు. నిరుద్యోగ సమస్యను సంపూర్ణంగా నిర్మూలించే విధంగా బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 4 లక్షల కోట్లు పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరంగా నిరుద్యోగ యువతకు మేలు జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచాన్నే శాసించే అమెరికా అధ్యక్షుడు, అమెరికాలో మోదీని సన్మానించిన విషయం చూసామన్నారు. కేసీఆర్ పాలనను ప్రజలు అసాహ్యించుకోడానికి 9 సంవత్సరాలు పడితే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు అసాహ్యించుకోడానికి 9 నెలలు పట్టిందన్నారు.

**కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారు.**

కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారని, కాంగ్రెస్ పార్టీని కానీ కేసీఆర్‌ను కానీ ప్రజలు నమ్మే విధంగా లేరని ఈటల రాజేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే బీఆర్ఎస్ అభివృద్ధి చేసిందని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందే కేసీఆర్ అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై కేసీఆర్ నిలదీయడం ఎంటన్నారు. కాళేశ్వరంపై అధికారులను ప్రశ్నిస్తే కేసీఆర్ చెప్పినట్లే చేసామని చెబుతున్నారు. కేంద్రంలో 70 మందికి పైగా మంత్రులు ఉంటే.. అందులో 30 మందికి పైగా బీసీలే ఉన్నారని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

# ఫోన్ ట్యాపింగ్ కథ కంచికేనా



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ౦2గా ఉన్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుకు ఊరట లభించింది. పలు దఫాలుగా విచారణ చేపట్టిన నాంపల్లి సెషన్స్ కోర్టు ప్రణీత్‌రావుకు బెయిల్ మంజూరు చేసింది. ప్రణీత్‌రావు చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై లాయర్ ఉమామహేశ్వరరావు ఫిబ్రవరి 11న ప్రతీణ్ రావు తరపున వాదనలు వినిపించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి విచారణకు హాజరుకాకపోవడంతో పీపీ వాదనల కోసం విచారణ నేటికి వాయిదా వేశారు. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఇతర నిందితులకు కోర్టులు బెయిల్ ఇచ్చాయని, ప్రస్తుతం ప్రణీత్ రావు ఒక్కరై జైలులో ఉన్నాయని లాయర్ ఉమామహేశ్వర రావు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ అడిషినల్ ఎస్పీ భుజంగరావు, మాజీ డీసీపీ ప్రభాకర్ రావులకు తెలంగాణ హైకోర్టు జనవరి 31న మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మరో నిందితుడిగా ఉన్న అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిందని వాదనలు వినిపించారు. ప్రణీత్ రావు బెయిల్ పిటిషన్ పై ఇరువైపుల వాదనలు విన్న జడ్జీ జస్టిస్ రమాకాంత్ రెగ్యూలర్ బెయిల్ మంజూరు చేశారు. బెయిల్ మంజూరు కావడంతో ప్రతీణ్ రావు త్వరలో విడుదల కానున్నారని ఆయన లాయర్ ఉమామహేశ్వరరావ తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్షనేతలైన కాంగ్రెస్, బీజేపీ నేతల ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దర్యాప్తు మొదలుపెట్టింది. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని దర్యాప్తులో తేలింది. ఎస్ఐబీలో ఉన్న 17 కంప్యూటర్లలో మొత్తం 42 హార్డ్ డిస్క్ లను తొలగించి.. వాటి స్థానంలో కొత్తవి అమర్చారు ప్రణీత్ రావు. పోలీస్ విచారణలో ప్రణీత్ రావు ఈ విషయాన్ని అంగీకరించారని అధికారులు తెలిపారు. మూసీ నదిలో నాలుగో బ్రిడ్జి కింద హార్డ్ డిస్క్ సంబంధించి శకలాలు గుర్తించారు. తమ వివరాలు తెలిసిపోతాయని హార్డ్ డిస్కులు ధ్వంసం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సీరియస్ గా తీసుకుని ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మాజీ ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును మొదట అరెస్ట్ చేసింది. విచారణలో తెలిసిన సమాచారం ఆధారంగా అనంతరం అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను సైతం పోలీసులు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్ష నేతల ఫోన్లతో పాటు సినీ సెలబ్రిటీలు, ఇతర ప్రముఖుల ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఫోన్లు ట్యాప్ చేసి వారికి సంబంధించిన రాజకీయ, వ్యక్తిగత విషయాలు తెలుసుకున్నారని విచారణలో ఒక్కో విషయం వెల్లడవుతోంది. అయితే ఈ కేసులో ఒక్కొక్కరిగా టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, ఎస్పీ భుజంగరావు, తిరుపతన్నలకు కోర్టులు బెయిల్ మంజూరు చేశాయి. తాజాగా ప్రణీత్ రావుకు నాంపల్లి సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## భారీ స్కామ్.. కోట్లు కొట్టేసిన కేటుగాళ్లు.. వీళ్ల ప్లాన్ తెలిస్తే షాక్ అవుతారు..




నగరంలో మరో భారీ స్కామ్ వెలుగు చూసింది. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో కేటుగాళ్లు భారీ మోసానికి తెరతీశారు. అమాయకులకు అధిక లాభాలు ఆశ చూపి ఏకంగా రూ.850 కోట్లు కొట్టేశారు. హైదరాబాద్‌లో క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో 2021లో కొంతమంది కంపెనీ పెట్టారు. చిన్న తరహా పెట్టుబడుల పేరుతో ఫోంజి స్కీమ్ ను తీసుకువచ్చారు. ఏజెంట్లను నియమించుకుని అమాయకులకు వల పన్నారు. తక్కువ మ్మొత్తంలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయంటూ నమ్మించారు. ప్రముఖ కంపెనీలతో సంబంధాలు ఉన్నాయంటూ ప్రజలను బురిడీ కొట్టించారు. మ్మొబైల్ అప్లికేషన్ ప్రారంభించి వసూళ్లకు పాల్పడ్డారు. కేవలం 45 నుంచి 180 రోజుల్లోనే 11 నుంచి 22 శాతం రిటన్స్ వస్తాయని చెప్పడంతో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు. వారి మాటలు నమ్మిన 6,979 మంది ఏకంగా రూ.1,700 కోట్ల డిపాజిట్లు చేశారు. ఒక్కొక్కరి వద్ద రూ.25 వేల నుంచి రూ.9 లక్షల వరకూ పెట్టుబడుల పేరుతో వసూలు చేశారు కేటుగాళ్లు. అందినకాడికి దోచుకున్న తర్వాత ఈ ఏడాది జనవరి 15 క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బోర్డు తిప్పేసింది. దీంతో బాధితులంతా సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. తమ నగదును ఎలాగైనా తిరిగి ఇప్పించాలని వేడుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంస్థ వైస్ ప్రెసిడెంట్ పవన్ కుమార్ ఓదెల, డైరెక్టర్ కావ్య నల్లూరిని అరెస్ట్ చేశారు. పట్టుపడిన ఇద్దరూ అమర్ దీప్ కుమార్, అర్యాన్ సింగ్, యుగంధర్ సింగ్ అనే ప్రధాన నిందితులతో కలిసి వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో గుర్తించారు. వీరంతా సేకరించిన రూ.1,700 కోట్లలో రూ.850 కోట్లు తిరిగి చెల్లించారని, మిగతా రూ.850 కోట్లకు కుచ్చుటోపీ పెట్టారని వెల్లడించారు. ఆ నగదును 14 షెల్ కంపెనీలకు దారి మళ్లించారని తెలిపారు.

## అధికారుల ఆలోచన విధానంలో మార్పు రావాలి

-మొదటిపేజీ తరువాయి

బయటికి రావడానికి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఇష్ట పడటం లేదు. జనంలోకి రండి అంటే రావడం లేదు. అధికారుల ఆలోచన విధానంలో మార్పు రావాలి. నిబద్ధత ఉన్న ఆఫీసర్లు ఎక్కడ ఉన్నా పోస్టింగ్‌లు వస్తాయి" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## గుడ్డెద్దు చేనులో పడినట్లుగా కాంగ్రెస్ పాలన ఉంది



-మొదటిపేజీ తరువాయి

ఇస్తుందని స్పష్టం చేశారు. 42శాతం రిజర్వేషన్లపై మొదట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులసంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. అప్పుడు తమ నిర్ణయం చెబుతామని కిషన్‌రెడ్డి అన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. బయ్యారం ఐరన్ ఓర్‌లో క్వాలిటీ లేదని చెప్పారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరిపై తాము ఎలాంటి హామీ ఇవ్వలేదని అన్నారు. రేవంత్ ప్రభుత్వం వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి లేని విషయాలను కల్పించుకుని మాట్లాడుతున్నారని విమర్శించారు. వారానికి ఒకసారి ఢిల్లీకి వెళ్లి సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పెద్దల దగ్గర హాజరువేయించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఇష్టం వచ్చినట్లుగా రేవంత్‌రెడ్డి మాట్లాడితే.. చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. రేవంత్ దృష్టి మరల్చినంత మాత్రాన ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రజలు మరచిపోరని కిషన్‌రెడ్డి చెప్పారు.

**రేవంత్ ప్రభుత్వంపై వ్యతిరేకత..**

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగలేని పరిస్థితి రాబోతోందని కిషన్‌రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఇలాగే వ్యతిరేకత వచ్చిందని.. అందుకే కాంగ్రెస్ విజయం సాధించిందని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందని మండిపడ్డారు. అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పదేళ్లు పట్టింది కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ సమయంలోనే వ్యతిరేకత మూటగట్టుకుందని చెప్పుకొచ్చారు. నాడు ప్రతిపక్షమే ఉండకూడదని కేసీఆర్ భావించారని అన్నారు. ఏకంగా లెజిస్లేటివ్ కౌన్సిల్ మూలాన్నే దెబ్బతీశారని కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కిషన్‌రెడ్డితో కాంగ్రెస్ ఎమ్మెల్యే భేటీ..అందుకేనా..!



**హన్మకొండజిల్లా:** తెలంగాణ రాజకీయల్లో కీలక పరిణామం? చోటు చేసుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కలిశారు. కిషన్‌రెడ్డి ఆదివారం(ఫిబ్రవరి16) హన్మకొండ పర్యటనకు వచ్చినపుడు ఎమ్మెల్యే ఆయనను కలిసి చర్చించండంతో పాటు అభివృద్ధి పనులపై వినతి పత్రం సమర్పించారు.ల వేయిస్తంభాల గుడిని అభివృద్ధి చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని, కుడా ఆధ్వర్యంలో చేపట్టే పనులకు అనుమతులు, నిధులు కేటాయించాలని కిషన్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరారు. ఎలాంటి రాజకీయ బేషమ్యాలకు పోకుండా హన్మకొండ అభివృద్దే తన ధ్యేయం అని ఎమ్మెల్యే చెప్పారు. అభివృద్ధి కోసమే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిశానని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ రాజకీయాల్లో ఇది కొత్త ఒరవడిని సృష్టిస్తుందన్నారు.

## సంపాదకీయం

# సమస్త జీవన రంగాలనూ ఏఐ

ఇప్పటికే సమస్త జీవన రంగాలనూ అల్లుకుపోయిన కృత్రిమ మేధ (ఏఐ)పై పారిస్‌లో వరసగా రెండురోజులపాటు కొనసాగి మంగళవారం ముగిసిన మూడో శిఖరాగ్ర సదస్సు ఆశించిన ఫలితాలు అందించలేకపోయింది. సరిగ్గా రెండేళ్ల క్రితం బ్రిటన్‌లోని బ్లెచ్‌లీ పార్క్‌లో జరిగిన తొలి ఏఐ శిఖరాగ్ర సదస్సు (సేఫ్టీ సమ్మిట్) పూర్తిగా భద్రతాపరమైన అంశాలపై దృష్టిపెట్టింది. నిరుడు దక్షిణ కొరియాలోని సియోల్‌లో జరిగిన రెండో శిఖరాగ్ర సదస్సు ప్రముఖ ఏఐ సంస్థల నుంచి భద్రతకు సంబంధించి నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటామన్న వాగ్దానాలు పొందగలిగింది. దానికి కొనసాగింపుగా పారిస్ శిఖరాగ్ర సదస్సును 'ఏఐ యాక్షన్ సమ్మిట్'గా నామకరణం చేశారు. ఏఐ పరిమితులేమిటో, అంతర్జాతీయ స్థాయిలో అందుకు పాటించాల్సిన నిబంధనలేమిటో ఈ శిఖరాగ్ర సదస్సు నిర్దేశిస్తుందని అందరూ ఊహించారు. కానీ బ్లెచ్‌లీ సదస్సు సాధించిన కొద్దిపాటి విజయాలనూ పారిస్ సదస్సు ఆవిరి చేసింది. దాపరికం లేని, సమ్మిళిత ఏఐ సాధనకు సమష్టిగా కృషి చేయాలన్న పిలుపునైతే ఇచ్చిందిగానీ, ఈ డిక్లరేషన్‌పై సంతకం చేసేది లేదని అమెరికా, బ్రిటన్‌లు మొరాయించాయి. మనతోపాటు 60 దేశాలు అంగీకరించిన ఈ డిక్లరేషన్‌ను అగ్రరాజ్యాలు కాదన్నాయంటే ఈ రంగం తీరుతెన్నులు ఎలా వుండబోతున్నాయో అంచనా వేయొచ్చు. 'కొన్నేళ్ల క్రితం చర్చించిన ఏఐ భద్రత గురించి మాట్లాడటానికి ఇక్కడకు రాలేదు. ఏఐలో వెల్లువలా వచ్చిపడే అవకాశాలే నావరకూ ప్రధానాంశం' అని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుండబద్దలు కొట్టారు. ఆయన ప్రస్తావించిన ఏఐ భద్రత అనేది నిజానికి 2023లో బ్రిటన్ చొరవతో బ్లెచ్‌లీ పార్క్ శిఖరాగ్ర సదస్సులో లోతుగా చర్చించిన అంశం. కానీ సదస్సులో పాల్గొన్న బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఆ సంగతే గుర్తులేనట్టు వ్యవహరించి అమెరికా తోకపట్టుకుపోయారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా దేశాల వైఖరులు మారితే అంతర్జాతీయంగా వాటికి విశ్వసనీయత ఏముంటుంది? ఇప్పటికే అమె రికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పారిస్ వాతావరణ ఒడంబడిక నుంచి బయటికొస్తున్నట్టు ప్రకటించారు. లక్షల కోట్ల పెట్టుబడితో ప్రధాన ఏఐ సంస్థలన్నీ సాగిస్తున్న పరిశోధనలు భవిష్యత్తులో ఎటువంటి కొత్త ఆవిష్కరణలకు అంకురార్పణ చేస్తాయో, అవి ప్రపంచ పౌరుల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపగలవోనన్న ఆందోళన అగ్రరాజ్యాలకు లేశమాత్రమైనా లేదని తేలిపోయింది. ఏఐతో ఉద్యోగాలకు ముప్పు వచ్చిపడుతుందని, భవిష్యత్తు అగమ్యగోచరమవుతుందని అన్ని దేశాల్లోనూ భయాందోళనలున్నాయి. వందమంది గంటలో చేయగల పని ఏఐ కొన్ని క్షణాల్లో చేసి చూపటాన్ని గమనిస్తే అవి సహేతుకమైనవేనన్న అభిప్రాయం కలుగుతుంది. అయితే శిఖరాగ్ర సదస్సుకు సహాధ్యక్షత వహించిన ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్టు ఉద్యోగాల స్వభావం మారు తుంది తప్ప ఉద్యోగాలు పోవు. కొత్త సాంకేతికతలు అడుగుపెట్టినప్పుడు ఆ నైపుణ్యతలను పెంచు కోలేనివారికి ఇబ్బందులుంటాయి. ఆ సాంకేతికతల్ని లొంగదీసుకోవటమే ఇందుకు పరిష్కారం. ఏఐ ఇప్పుడు దాదాపు అన్ని రంగాల్లోనూ అద్భుతాలు సృష్టిస్తోంది. ముఖ్యంగా వైద్య, వైజ్ఞానిక రంగాల్లో చోటుచేసుకుంటున్న పరిశోధనలు పూర్తి స్థాయిలో అందుబాటులోకొస్తే ఊహకందని వినూత్న ఆవిష్కరణలు రంగప్రవేశం చేస్తాయి. చికిత్సకు లొంగని మొండివ్యాధులు పలాయనం చిత్తగిస్తాయి. ఆయుఃప్రమాణాలు పెరుగుతాయి. అయితే రక్షణ, యుద్ధతంత్ర, అంతరిక్ష రంగాల్లో ఇది సృష్టించగల ఉత్పాతాలు చిన్నవేమీ కాదు. ఇందుకు కొత్త తరం ఏఐ మోడల్స్ ఉదాహరణ. తాజా మోడల్ ఒకటి సవరణలకు అవకాశం లేకుండా తన సృజనకర్తనే పక్కదారి పట్టించేలా తనను తాను కాపీ చేసుకుందని ఆ రంగంలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు బయటపెట్టారు. వచ్చే అయిదేళ్లలో సూపర్ హ్యూమన్ స్థాయి ఏఐ రూపొందటం ఖాయమని వారంటున్నారు. భద్రతకు సంబంధించి ఏఐలో సాగుతున్న పరిశోధనల్లో తలెత్తే ప్రశ్నలకు పరిష్కారం కనుగొనకపోతే పరిణామాలు దారుణంగా ఉంటాయన్నది వారి హెచ్చరిక. కానీ అమెరికా తప్పుడు సూత్రీకరణలు చేస్తోంది. భద్రత గురించిన జాగ్రత్తలను సెన్సార్‌షిప్‌గా వక్రీకరిస్తోంది. యూరప్ యూనియన్ (ఈయూ) రూపొందించిన నియంత్రణ చట్టాలు ఆ రంగం పీకనొక్కడానికే పనికొస్తాయని వాన్స్ భాష్యం చెబుతున్నారు. ఏఐ విషయంలో సైద్ధాంతిక పక్షపాతాలకు అతీతంగా వ్యవహరించాలని, స్వేచ్ఛనీయాలని ఆయన డిమాండ్. తప్పుడు సమాచార వ్యాప్తిని గుర్తించి తొలగించటానికి ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాలు రూపొందించుకున్న ఉపకరణాలను (ట్రంప్ వస్తారనగానే ఆ సంస్థలు స్వచ్ఛందంగా వాటిని ఉపసంహరించుకున్నాయి) సెన్సార్‌షిప్‌గా వక్రభాష్యం చెప్పినవారు ఇంతకుమించి ఆలోచించగలరా? ఏఐ రంగంలో ఇప్పట్లాగే భవిష్యత్తులోనూ తన ప్రాబల్యమే కొనసాగుతుందని, దాన్ని గుప్పెట్లో పెట్టుకుని లక్షల కోట్ల లాభాలు ఆర్జించవచ్చని అమెరికా కలగంటోంది. కానీ ఇటీవల చైనా నుంచి వచ్చిన డీప్‌సీక్ దూకుడు గమనిస్తే ఈ రంగం ఎవరి జాగీరూ కాదని స్పష్టమవుతోంది. ఇలా నిరంతరం ఊహాతీతంగా చక చకా ఎదుగుతున్న రంగానికి బాధ్యతాయుతమైన మార్గాన్ని నిర్దేశించకపోతే దానివల్ల మానవాళికి ముప్పు కలిగే అవకాశం లేదా? సురక్షిత, హేతుబద్ధ, పారదర్శక ఏఐ రూపొందటానికి దేశాలన్నీ సమష్టిగా కృషి చేయకపోతే, సాధించే అభివృద్ధిని ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి నెలకొల్పనట్టయితే అది స్వీయ వినాశనానికే దారితీస్తుందని అన్ని దేశాలూ గుర్తించాలి.

# న్యాయస్థానంలో ఎన్నికల సంఘం

ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సందర్భాల్లో తప్ప వినబడని ఎన్నికల సంఘం(ఈసీ) పేరు ఇటీవలి కాలంలో తరచు వార్తల్లోకెక్కుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకొని ప్రచారం వరకూ... ఆ తర్వాత ఎన్నికల్లో పోలైన వోట్ల శాతం, వాటి లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకూ అన్ని దశల్లోనూ ఈసీపై నిందలు తప్పటం లేదు. తాజాగా ప్రజాతంత్ర సంస్కరణల సంఘం (ఏడీఆర్) దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం విచారిస్తున్న సందర్భంగా ఈవీఎంల పరిశీలన ప్రక్రియ అమల వుతుండగా వాటి డేటాను తొలగించవద్దని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించాల్సి వచ్చింది.




నిరుడు ఏప్రిల్‌లో ఈ విషయమై ఇచ్చిన ఆదేశాలను సరిగా అర్థం చేసుకుని, సక్రమంగా పాటిస్తే ఇలా చెప్పించుకోవాల్సిన స్థితి ఈసీకి ఉండేది కాదు. ఈవీఎంలనూ, దానికి అనుసంధానించి వుండే ఇతర యూనిట్లనూ భద్రపరిచే విషయమై సుప్రీంకోర్టు అప్పట్లో కీలక ఆదేశాలిచ్చింది. అవి సరిగా పాటించటం లేదని ఏడీఆర్ మరోసారి కోర్టును ఆశ్రయించింది. ఎన్నికల్లో పరాజితులై 2, 3 స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు కనుక ఆ ఎన్నికను సవాలు చేసిన సందర్భాల్లో తనిఖీ చేయడానికి అనువుగా ఈవీఎంలతోపాటు, వాటిలో పార్టీల గుర్తులను లోడ్ చేయటానికి ఉపయోగించే సింబల్ లోడింగ్ యూనిట్ (ఎస్ఎల్‌యూ)లను సైతం 45 రోజులపాటు భద్రపరచాలని సుప్రీంకోర్టు ఈసీని ఆదేశించింది.

ఎన్నికల ఫలితంపై న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయటానికి పరాజిత అభ్యర్థులకుండే 45 రోజుల వ్యవధిని దృష్టిలో పెట్టుకుని ధర్మాసనం ఇలా ఆదేశించింది. అసెంబ్లీ నియో జకవర్గ పరిధిలోని 5 శాతం ఈవీఎంలు, ఎస్ఎల్‌యూలను ఇంజనీర్ల, ఉత్పత్తిదారుల సమక్షంలో తనిఖీకి అనుమతించవచ్చని సూచించింది. వీవీ ప్యాట్ స్లిప్‌లను లెక్కించే యంత్రాలు సమకూర్చు కునే ఆలోచన చేయాలని కూడా ఆ సందర్భంగా కోరింది. ఈ ఆదేశాల ఆంతర్యమేమిటో సుస్పష్టం. ఎన్నికలు న్యాయబద్ధంగా జరగడమే కాదు... అలా జరిగినట్టు కనబడాలంటే అంతా పారదర్శకంగా ఉండాలన్నది ధర్మాసనం ఉద్దేశం.

సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల అనంతరం ఈవీఎంలూ, వీవీప్యాట్‌లూ, ఎస్ఎల్‌యూల పరిశీలన విషయంలో ఈసీ కొన్ని నియమ నిబంధనలు విడుదల చేసింది. న్యాయస్థానం ఆదేశాలకూ, ఆ నియమ నిబంధనలకూ ఎక్కడా పొంతన లేదు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోనూ 5 శాతం ఈవీఎంలు తనిఖీ చేయాలని ధర్మాసనం ఇచ్చిన ఆదేశానికి ఈసీ వేరే రకమైన భాష్యం చెప్పింది. వినియోగించిన ఈవీఎంలలో ఏ పార్టీకి ఎన్ని వోట్లు లభించాయో చూసి, వీవీ ప్యాట్ స్లిప్‌లు దానికి అనుగుణమైన సంఖ్యలో ఉన్నాయా లేదా అన్నది తేలిస్తే వేరే రకంగా ఉండేది.

కానీ ఈసీ చేసిందల్లా ఇతరత్రా గుర్తులతో మళ్లీ నమూనా పోలింగ్ నిర్వహించి ఈవీఎంల డేటాకూ, వీవీప్యాట్ స్లిప్‌ల సంఖ్యకూ మధ్య తేడా లేదని నిరూపిస్తే చాలని భావించింది. అంతేకాదు... ఆ నమూనా పోలింగ్ కోసం ఈవీఎంలలోని డేటాను ఖాళీ చేసింది! ఈవీఎంలు సరిచూడాలని అభ్య ర్థులు కోరటం అంటే తమ సమక్షంలో ఈవీఎంలలో ఉన్న సాఫ్ట్‌వేర్‌నూ, హార్డ్‌వేర్‌నూ ఇంజనీర్లు పరిశీలించాలని... వీవీ ప్యాట్ స్లిప్‌ల సంఖ్య ఈవీఎంల డేటాతో సరిపోయిందో లేదో చూడాలని అడగటం.

ఈసీ అనుసరించిన ప్రక్రియకూ, అభ్యర్థులు కోరుకునేదానికీ పొంతన ఎక్కడైనా ఉందా? ఈ మాత్రానికే అభ్యర్థులనుంచి ఈవీఎంకు రూ. 40,000 చొప్పున వసూలు చేయటం సిగ్గనిపించ లేదా? చిత్రమేమంటే... ఒక్కో ఈవీఎం తయారీకి ఖర్చయ్యేది కేవలం రూ. 30,000! గత లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, ఒడిశాల నుంచి 11 మంది అభ్యర్థులు ఈవీఎంలూ, వీవీప్యాట్ స్లిప్‌ల పరిశీలన కావాలన్నారని, అంతా పూర్తయ్యాక ఎక్కడా తేడా కనబడలేదని ఈసీ తేల్చింది.

దేశవ్యాప్తంగా చూస్తే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇటువంటి అభ్యర్థనలే 83 వరకూ రాగా, అంతా సవ్యంగానే ఉన్నదని నిర్ధారణ అయిందని వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో 45 రోజులలోపు ఈవీఎంల డేటా తొలగించరాదన్న నిబంధనను సైతం ఈసీ ఉల్లంఘించింది. ఒకపక్క ఈవీఎంల పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతుండగా ఇలా చేయటం అనుమానాలను మరింత పెంచుతుందన్న ఇంగితజ్ఞానం దానికి లేకపోయింది.

మేమిచ్చిన ఆదేశాలేమిటో, మీరు అనుసరించిన ప్రక్రియేమిటో వివరిస్తూ వచ్చే నెల 3లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఈసీని ఆదేశించటం హర్షించదగ్గది. అసలు 45 రోజుల్లోపే డేటాను ఎందుకు తొలగించాల్సివచ్చిందో కూడా ఈసీనుంచి సంజాయిషీ కోరాలి. ఇక పోలింగ్ శాతంపై ఈసీ విడుదల చేసిన ప్రకటనలు మరింత చిత్రంగా ఉన్నాయి. ఏడు దశల్లో జరిగిన పోలింగ్‌లో 3.2 శాతం నుంచి 6.32 శాతం వరకూ వోట్లు పెరిగినట్టు ఈసీ తేల్చింది.

ఈ పెరిగిన వోట్ల శాతం ఆంధ్రప్రదేశ్‌లో 12.54 శాతం, ఒడిశాలో 12.48 శాతం ఉంది. పోలింగ్ ముగిసిన రాత్రి ఏపీలో 68 శాతం వోట్లు పోలయ్యాయని ప్రకటించగా, తుది ప్రకటనలో అది కాస్తా 81 శాతానికి ఎగబాకింది. ఈవీఎంల చార్జింగ్ పెరగటం మరో కథ! ఈ మార్పుల వెనకున్న మంత్రమేమిటో చెప్తే అందరూ విని తరిస్తారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ ఎంతో నిష్ఠగా నిర్వహించాల్సిన క్రతువు. ఒక రాజ్యాంగ సంస్థ అయివుండి, నిష్పక్షపాతంగా, నిక్కచ్చిగా వ్యవహరించాల్సిన ఈసీ అందుకు భిన్నమైన పోకడలను ప్రదర్శించటం దానికి ఎంతమాత్రమూ గౌరవప్రదం కాదు. ఈసీ తీరు గమనించాక చాలామంది మళ్లీ బ్యాలెట్ పత్రాలకు మళ్లాలని డిమాండ్ చేస్తున్నారు. ఈసీ బాణీ మారకపోతే చివరకు బ్యాలెట్ పత్రం విధానం కోసం జనం ఎలుగెత్తే రోజులు రావటం ఖాయం

# మలయాళీ బానిసల న్యాయ ఉద్ఘోష

కేరళకు చెందిన పోయ్‌కయిల్ యోహనన్ గొప్ప సంఘ సంస్కర్త. సామాజిక విప్లవకారుడిగా ఆయన అక్కడి బానిస జాతుల అభ్యున్నతి కోసం జీవితకాలం పోరాడాడు. వివిధ సంస్థలను స్థాపించి తన పాటలు, ప్రసంగాల ద్వారా దళిత జన ఐక్యతకు పాటుపడ్డాడు. ఆనాటి బానిస జాతుల వేదనలను తన పాటల ద్వారా వినిపించాడు. ఆయన రాసిన 'నా గురించి ఒక్క అక్షరమూ లేదు' అనే గీతం ఇప్పటికీ అక్కడి జనం గొంతెత్తి పాడుకుంటారు. "ఎన్నో జాతుల గురించి చరిత్రలున్నాయి/ మా గురించి ఎక్కడా ఓ అక్షరం లేదు/ నా జాతి చరిత్ర రాసేందుకు భూమ్మీద ఎవరూ లేరు/ నేల నుంచి ఆకాశం దాకా మమ్మల్ని ద్వేషించేవారే!" అనే పంక్తులు అప్పటి మలయాళీ బానిస జాతుల వేదనను స్పష్టం చేస్తాయి. దేశంలో నేటికీ మారని అణగారిన వర్గాల పరిస్థితులకు అవి అద్దం పడతాయి. బానిస వ్యవస్థ అంటే అమెరికాలో నీగ్రోలే గుర్తుకొస్తుంటారు. అయితే అదే పరిస్థితి కేరళలోని సంస్థానాల్లో ఎంతోకాలం కొనసాగింది. దళిత, గిరిజనులను దొరకబుచ్చుకొని వారిని బానిసలుగా అమ్ముకున్న చరిత్ర కేరళకు ఉంది. అయితే, బ్రిటిష్ పాలనా కాలంలో వివిధ సంస్థానాలు 1850%-%60 దశకాల్లో ఈ దురాచారాన్ని రద్దు చేశాయి. అయితే చట్టాలు సామాజిక ఆచరణలోకి ఊరికే రావు. వాటి కోసం సామాజిక ఉద్యమాలు కావాలి. దళితజాతులపై వివక్షను సమాజం లోంచి పెకిలించేందుకు పాటుపడిన కేరళ ఉద్యమకర్తల్లో పోయ్‌కయిల్ యోహనన్ ముందుంటారు. కేరళలోని ఎరవిపేరూరులో యోహనన్ 17 ఫిబ్రవరి 1879న జన్మించాడు. ఆయనది పరయ బానిస కుటుంబం. దళిత క్రైస్తవులపై వివక్షకు నిరసనగా 1909లో ఆయన ప్రత్యక్ష రక్ష దైవసభను స్థాపించాడు. ఈ సభ ద్వారా దిగువజాతులపై జరుగుతున్న మతపర వైపరీత్యాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. మతాతీతంగా మనుషులందరిలో దేవుడున్నాడని, మనుషులందరి హితం కోరే మనిషి రూపంలోనే ఉద్భవిస్తాడని ఆయన అనుచరులకు బోధించాడు.




సంస్కర్తగా యోహనన్ అణగారిన జాతుల క్షోభ అందరికీ చేరేందుకు కవిత్వాన్ని ఆయుధంగా వాడుకున్నాడు. ఆయన గేయాల్లో దళిత పేదల బాధలు కళ్ళకు కట్టినట్లుగా ఉంటాయి. సామాన్యులకు అర్థమయ్యే రీతిలో, జనభాషలో రాసిన ఆ పాటలు మౌఖికంగా వ్యాప్తి చెంది ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి. "నన్ను బానిస అంటే చర్చికి వెళ్ళాను/ అక్కడా అందరితో సమానంగా నన్ను చూడలేదు/ హిందుత్వపు నీడలో అస్తిత్వాన్ని వెదుకుతూ/ చివరి వరుసలో అనాథగా తిరుగుతున్నాను/ హిందువులు, క్రిస్టియన్లు మమ్మల్ని ఎవరూ తమవారిగా ఒప్పుకోరు/ నా జాతి గురించి చెప్పుకోవడానికి నేను సిగ్గ పడను/ గుండె నిండా వేదనతో నా గాథ ముందుంచుతాను/ జనంలోని క్రూరత్వాన్ని విప్పి చెబుతాను/ అందరి దృష్టిలో ఈ భూమ్మీద నేను శాపగ్రస్త జీవిని/ భూమ్యాకాశాల నడమ నన్నే నిందిస్తారు/ భూమ్మీద అన్నిటిని తీర్చిదిద్దిన దేవుడు/ ఈ వివక్షను ఎలా అనుమతించాడు" అని తన గీతాల్లో ఆయన ప్రశ్నించాడు. "దైవమా నన్ను విస్మరించకుము/ భూమ్మీద ఏ ఒక్కరు నన్ను దీవించ లేదు/ భవిష్యత్తులో కూడా జరుగుతుందని ఆశ లేదు/ ఈ భూమ్మీద నన్ను అంగీకరించేవారెవరూ లేరు/ మరెవరు రారు/ నీ భుజాలతో చుట్టేసి నా కన్నీరును తుడువు/ ఈ భూమ్మీద ఎవరికీ చెందని గూటి కోసం వెదుకుతూ తిరుగుతున్నాను/ నా బాధ్యత తీసుకొని చేరదీసి పక్కన కూచోబెట్టుకో/ మోక్షం ప్రసాదించి నా బాధల్ని తుడిచెయ్" అని ఆధ్యాత్మిక ధోరణిలో వేడుకున్నాడు. రత్నమాణికల్ అనే పేరిట యోహనన్ గీతాలు సంపుటిగా వచ్చాయి. ఎం.ఆర్. రేణుకుమార్ 'పోయ్‌కయిల్ యోహనన్' అనే పేరుతో ఆయన ఆత్మకథను రాశాడు. యోహనన్ జీవితాన్ని వి.వి. శాంత కుమార్ 'మన్నిక్కలే మాణిక్యం' పేరుతో నాటకంగా తీర్చిదిద్దాడు. ఆత్మగౌరవం కోసం వెదికిన యోహనన్ తొలుత మార్తోమా సిరియన్ చర్చి విధానాన్ని స్వీకరించాడు. అక్కడ కూడా క్రైస్తవుల మధ్య సమానత్వం దొరకకపోవడంతో దాన్ని వదిలేశాడు. ఆ తర్వాత ఎవాంజెలికల్ అనే క్రిస్టియన్ బ్రెథ్రెన్ మిషన్‌లో చేరి నాలుగేళ్ళ తర్వాత అదీ నచ్చక బయటికొచ్చాడు. ఈ రెండు అనుభవాల తర్వాత భారత సమాజంలోని క్రిస్టియన్లలో కులతత్వం మూలాల్లోనే ఉందని, క్రీస్తు బోధనల వల్ల అది మరింత లోతుగా వెళ్లిందని గ్రహించిన ఆయన సొంత మార్గంలో దళిత విముక్తి ఉద్యమంగా ప్రత్యక్ష రక్ష దైవసభను స్థాపించాడు. "బైబిల్‌లో మా గురించి ఒక్క అక్షరం లేదు. అందులో ఉన్నదంతా బయటి ప్రాంతాల్లో జరిగిందే. మా బానిసత్వం గురించి ప్రస్తావన, సానుభూతి కనబడని పుస్తకాన్ని మేమెందుకు చదవాలి" అని ప్రశ్నించాడు. క్రైస్తవాన్ని నిరసిస్తూ తనను ద్రావిడ దళితుడిగా ప్రకటించుకున్నాడు. కేరళకు చెందిన ప్రసిద్ధ సంఘ సంస్కర్త అయ్యంకాళి స్థాపించిన సాధుజన పరిపాలన సంఘంలో సభ్యత్వం తీసుకున్నాడు. దళితజాతి ఉన్నతికి నిర్విరామంగా పాటుపడిన యోహనన్ 29 జూన్, 1939న మరణించాడు. నేటికీ కేరళలోని అణగారిన వర్గాల గుండెల్లో ఉద్యమకర్తగా, వాగ్గేయకారుడిగా ఆయన స్థానం పదిలంగా ఉంది.

# రాష్ట్ర స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి



**అగ్నిధారన్యూస్ 8 ఇంక్లైన్ కాలనీ :** హైదరాబాద్ మగ్దూం భవన్ లోని రాజబహదూర్ గౌర్ హాల్లో ఈ నెల 18న మధ్యాహ్నం ఒంటి గంటకు జరగనున్న బి సి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని జయప్రదం చేయాలనిబిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ఒక ప్రకటన లో తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో జరిగిన కులగణన ఆధారంగా రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం కాకుండా జనాభా నిష్పత్తి ప్రకారమే రిజర్వేషన్ ప్రక్రియ చేపట్టాలని, అలాగే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి లో ఇచ్చిన బి సి డిక్లరేషన్లో ఉన్న అన్ని అంశాలను అమలు చేయాలని, కేవలం స్థానిక సంస్థల ఎన్నికలే కాకుండా ఆనాటి డిక్లరేషన్ లో అనేక అంశాలు ముడి పడి ఉన్నాయని వాటన్నింటిని సాధించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బి సి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాల రూప కల్పన కొరకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హాజరవుతున్నారు.

# వధూ వరులను ఆశీర్వదించిన మాజీ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండల పరిధిలోని దేవకి గార్డెన్లో జూలపల్లి గ్రామానికి చెందిన ముదిగొండ ఉదయ్ కుమార్ సాయి శిరీష వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్,ఉప్పల చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్. ఈ కార్యక్రమంలో, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ, తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, జూలపల్లి మాజీ సర్పంచ్ గౌత రెడ్డి విజయ్ రెడ్డి, అంజి మహారాజ్, అశోక్ గౌడ్, సంపత్ కుమార్, తుడుం శ్రీశైలం, నాయకులు తదితరులు

# వెంకటేష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటాం



## కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కటిక వెంకటేష్, మాతృ మూర్తి అనారోగ్యంతో బాధపడుతు మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, పూల బాయి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటానని వారి కుటుంబానికి 3000/ రూ వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు .అనంతరం తలకొండపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసేవ మల్లేష్, పోతుగంటి గణేష్, తుమ్మ నరసింహ, వారు వంతు సాయంగా 3000 / రూపాయలు బాధిత కుటుంబాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో , గ్రామ అధ్యక్షుడు పెరమళ్ళ రమేష్, జిల్లా నాయకులు రవీందర్ యాదవ్, మార్కెట్ డైరెక్ట్ అజీమ్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు డిగ్రీ కృష్ణ, రామ్మోహన్ రెడ్డి, యాదగిరి, అంజయ్య, అమరేందర్, రమేష్ ,పోతుగంటి సురేష్, శ్రీను, సుదర్శన్, పోతుగంటి మల్లేష్, శశి, మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల18న కేటీఆర్ ఆధ్వర్యంలో రైతు దీక్షను విజయ వంతం చేయాలి



## బిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోని గణేష్


**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** ఈ నెల 18వ తేదీన ఆమనగల్ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్న రైతు దీక్షను విజయవంతం చేసి రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలనీ దానికోసం అందరం కలిసి మెలసి ముందుకు వెళ్లాలని కోరుతూ.కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎగ్గొట్టిన 3 పట్టాల రైతుబంధు ఇవ్వాలి, పాల ఉత్పత్తి దారులకు పాల బిల్లులు ఇవ్వాలి,వడ్లకు 500 బోనస్ ఇవ్వాలి, 2 లక్షల వరకు ఋణ మాఫీ చేయాలి,రైతు బీమా పథకం అమలు చేయాలి,24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాలు,యువకులతో,రైతులతో పెద్ద సంఖ్యలో ఆమనగల్ పట్టణంలో రైతు దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన దారమోని గణేష్ ఈ కార్యక్రమంలో, తెలంగాణ ఉద్యమ నాయకులు రమేష్ గౌడ్ ,శేఖర్ ,అల్లుడు కృష్ణ ,శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వధూ వరులను ఆశీర్వదించిన మాజీ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండల పరిధిలోని దేవకి గార్డెన్లో జూలపల్లి గ్రామానికి చెందిన ముదిగొండ ఉదయ్ కుమార్ సాయి శిరీష వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్,ఉప్పల చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్. ఈ కార్యక్రమంలో, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ, తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, జూలపల్లి మాజీ సర్పంచ్ గౌత రెడ్డి విజయ్ రెడ్డి, అంజి మహారాజ్, అశోక్ గౌడ్, సంపత్ కుమార్, తుడుం శ్రీశైలం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఠాగూర్ బాలాజీ సింగ్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి పట్టణంలోని కెసిఆర్ ఫంక్షన్ హాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి మంగలి మురళి కూతురు వివాహానికి హాజరై నూతన వధువు పరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్ ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** అమనగల్లు మండలం బి ఆర్ ఎస్ పార్టీ యువనాయకుడు నేనవత్ కళ్యాణ్ నాయక్ సోదరి వివాహా వేడుకలను విచ్చేసి వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జోగు వీరయ్య,నాగర్ కర్నూల్ జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు గుమ్మకొండ రాజు, జంతు క కిరణ్, సుమన్ నాయక్, రాయసాల్ నాయక్, అల్లాజి,వస్ఫుల జైపాల్ తదితరులు ఉన్నారు.

# రెండవ రోజు శ్రీ సీతా రామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహా ప్రతిష్ట వేడుకలు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమ వేడుకలు రెండో రోజు గ్రామ ప్రజలు కన్నుల పండుగగా ఘనంగా జరుపుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాంప్రదాయ దుస్తులతో హోమం పై కూర్చొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు తీసుకొని తమ కోరికలు నెరవేరాలని స్వామివారిని కోరారు. అనంతరం భక్తులు శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధులలో భక్తులు కోలాటాలు భజన పాటలతో ఆడుతూ, మహిళలు మంగళ హారతులతో బతుకమ్మ పాటలతో స్వామివారి నామస్మరణంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ సీతా రామ లక్ష్మణ విగ్రహా ప్రతిష్ట వేడుకలో పాల్గొనడం గొప్ప అదృష్టం





## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కాయితి ఆషాదీప్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమ వేడుకల్లో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్నా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కాయితి ఆషాదీప్ రెడ్డికి ఆలయ కమిటీ నిర్వాహకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొనడం చాలా అదృష్టకరం అని అన్నారు. శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి కరుణతో గ్రామ ప్రజలు నిత్యం చల్లగా ఉండాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో,ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇంటింటికి పూలే అంబేద్కర్ జ్ఞానమాల చేపట్టాలి,

## మంతెన సంపత్,

## కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రముఖ కాంగ్రెస్ నాయకులు

## దేశ ప్రజలకు రక్షణ కవచం భారత రాజ్యాంగం,

## ప్రముఖ కార్మిక నాయకులు తోట వేణు,

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** మహాత్మా జ్యోతిరావు పూలే బాబాసాహెబ్ అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మంతెన సంపత్, ప్రముఖ కార్మిక నాయకులు, తోట వేణు లు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బొంకూరి మధు ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్లరమేష్ బాబులతో కలిసి గోదావరిఖని పట్టణంలో, పూలే అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి జ్ఞానమాల కార్యక్రమాన్ని చేపట్టారు మహాత్మ జ్యోతిరావు పూలే బాబా సాహెబ్ అంబేద్కర్ పేరిటచేపట్టే జ్ఞానమాల కార్యక్రమం అనగారిన వర్గాల్లో చైతన్యాన్ని స్ఫూర్తిని నింపుతుందని, ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మంతెన సంపత్ అన్నారు, పూలే అంబేద్కర్ జ్ఞానమాల కోల్,బెల్టు ప్రాంతంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలన్నారు, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇంటింటికి జ్ఞానమాల కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు పూలే అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ఇంటింటికి తీసుకువెళ్లే కార్యక్రమంలో తన సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు , ప్రముఖ కార్మిక నాయకులు తోట వేణు మాట్లాడారు, మనువాద శక్తులు భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు అందుతున్నాయని దానిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు, భారత రాజ్యాంగమే దేశ ప్రజలకు రక్షణ కవచంగా ఉందన్నారు పూలే అంబేద్కర్ జ్ఞానమాల గొప్ప కార్యక్రమం అన్నారు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆలయ ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, ఆలయ ఫౌండేషన్ సీఈవో,తీ ట్ల రమేష్ బాబు,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్,రాష్ట్ర కార్యదర్శి శ్రీ,మంతెన లింగయ్య రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కన్వీనర్ బూడిద మహేందర్ ఆలయ ఫౌండేషన్ డిప్యూటీ సీఈవో మిట్టపల్లి రాజేంద్రకుమార్, సభ్యులు ఆర్నా కొండ కొండ వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రామగుండం నియోజకవర్గ ఇన్చార్జి బోట్ల స్వామి, జిల్లా కోకన్వీనర్లు, పోగుల రంగయ్య దుబాసి బొందయ్య గద్దల శశిభూషణ్ , కలువల రాజేశం,అంతర్గాం మండల సీనియర్ నాయకులు ఉప్పులేటి పవన్ కుమార్ , ఏఐటీయూసీ



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు ఎంఏ కరీం ప్రధాన కార్యదర్శి శనిగరం చంద్రశేఖర్ , ఆలయ ఫౌండేషన్ సభ్యులు మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల సమ్మయ్య ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు కొంకటి శ్రీకాంత్, ఆవు నూరి రాంబాబు, మంతెన అశోక్, కుక్క సతీష్ సిహెచ్ రమేష్, ఆలయ ఫౌండేషన్ సభ్యులు కృష్ణ చారి కలవల సాగర్, తదితరులు పాల్గొన్నారుమంతెన సంపత్, తోట వేణుకు ఘన సన్మానం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు, కలువల రాజేశం ఆధ్వర్యంలో, ముఖ్య అతిథులుగా హాజరైన మంతెన సంపత్, తోట వేణుకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు

# ఉచిత వైద్య శిబిరానికి చక్కని స్పందన

**అగ్నిధార న్యూస్ (సంగారెడ్డి) జిల్లా,** ఝరాసంగం మండలం కొల్లూరు గ్రామం లో జనని ఫౌండేషన్ మరియు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సంగారెడ్డి వెల్నెస్ హాస్పటల్ వారి సమక్షం లో ఉచిత మెగా వైద్య శిబిరం కు చక్కని స్పందన లభించింది. గ్రామ ప్రజలు మరియు , చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు కూడా ఈ క్యాంపులో పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు ఈసీజీ , షుగర్ , బిపి , తదితర వైద్య పరీక్షలు చేసుకోని,,వెల్నెస్ హాస్పిటల్ డాక్టర్స్ కు చూపించుకొని డాక్టర్స్ సలహాలు సూచనలు తీసుకున్నారు. ఉచితంగా మందులు కుడా ఇవ్వడం జరిగింది. యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్, చేతులమీదుగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంబించారు,ఈ కార్యక్రమములో సీనియర్ జర్నలిస్ట్ రాయికోటి నర్సింలు, డాక్టర్ జాన్ శ్రీకాంత్,బర్ధిపూర్ మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, శ్రీకాంత్ రెడ్డి,రాంపూర్ ప్రకాష్, దేవపుత్ర, రాజేందర్, గ్రామ పెద్దలు నందు పాటిల్, దప్పూరు సంగమేష్, ధన్ రాజ్ గౌడ్, నర్సింహారెడ్డి, ప్రవీణ్ పాటిల్, వీరన్న పాటిల్,కిందోడ్ల నర్సింలు,వై నగేష్, ఎం విష్ణు, సిహెచ్ నర్సింలు, కుపేందర్,సి హెచ్ మాణయ్య,సి మొగులప్ప,సి సుబాకర్,సి రాజు కుమార్,సి నర్సిములు ,అంబేద్కర్, టి యాదుల్,సి ప్రకాష్ తధితరులు పాల్గొన్నారు.,ఇట్టి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జనని ఫౌండేషన్ చైర్మన్ చింతలగట్టు శివరాజ్ మాట్లాడుతు తనవంతుగా గ్రామ ప్రజలకు మంచి వైద్యాన్ని "వెల్నెస్ హాస్పిటల్ ద్వారా ఒక రోజు ఉచిత వైద్య శిబిరం" నీ ఏర్పాటు చేయాలనే మంచి ఆలోచన ద్వార ఇట్టి కార్యక్రమాన్ని ఎర్పాటు చేయడం జరిగిందని అన్నారు, అవకాశం ను ప్రజలు సద్వినియోగం చేసుకువాలని ఆరోగ్యమే మహాభాగ్యము అని ఏ చిన్న ఆరోగ్య సమస్య ఉన్న వైద్యులను సంప్రదిస్తే,సూచనలు సలహాలు ఇచ్చి మందులను ఇస్తారు అని ,నిర్లక్షం చేస్తే చిన్న పాటి ఆరోగ్య సమస్య కూడా పెద్దది అవుతుంది అని పేర్కొన్నారు.



# నూతన దంపతులను ఆశీర్వదించిన నేతకాని సంఘం నాయకులు



**అగ్నిధార న్యూస్ (ఎండపెల్లి ):** జగిత్యాల జిల్లా అంబర్పేట గ్రామానికి చెందిన బండారి లింగయ్య - భాగ్య దంపతుల ప్రథమ పుత్రిక వివాహము వేడుకల్లో నేతకాని సంఘం జిల్లా నాయకులు బండారి శివశంకర్, దూట మల్లేష్, సునారికారి కిరణ్. గోల్లే.శంకర్ తదితరులు పాల్గొని నూతన మధుపరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం.



**అగ్నిధార న్యూస్ కమాన్పూర్ :** కమాన్ పూర్ లో ని జిల్లా పరిషత్ పాఠశాలలో 1998-99 లో విద్యను అభ్యసించిన అలనాటి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించుకున్నారు. ముందుగా కమాన్ పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో తమ పూర్వపు క్లాస్ గదుల్లో కూర్చుని మళ్లీ పాత గురువులే గురువుగా మారి పాఠాలను చెప్పడం జరిగింది. మళ్లీ అ లనాటి విద్యార్థులు నేడు విద్యార్థులుగా మారి పాఠాలను విన్నారు. అనంతరం పెద్దపల్లి - మంథని లక్ష్మీ గార్డెన్ లో ఉపాధ్యాయులైన గడియారం ప్రవీణ్ కుమార్, కోల నారాయణ, మొహమ్మద్ అబ్దుల్ కధీర్ జాఫ్రి, బలంగుల హనుమాన్లు, లను శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు. సుమారు 50 వేల రూపాయల విలువ గల మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయనున్నారు. పాఠశాలలో స్వీపర్ గా పనిచేసి రిటైర్డ్ అయిన కళావతికి 3000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆటపాటలతో మాట ముచ్చట్లతో అలరించారు. కాగా తమ ఆధ్వర్యంలో పాఠశాలకు మరింత చేయూతనిస్తామని అభివృద్ధికి సహకరిస్తామని అలనాటి విద్యార్థులు పేర్కొన్నారు. అలనాడు వారితో విద్యను అభ్యసించి అకాల మరణం పొందిన తోటి విద్యార్థులు. స్వర్గస్తులైన ఉపాధ్యాయుల మృతికి సంతాపం ప్రకటించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల్లో వివిధ పట్టణాల్లో నివాసం ఉంటున్న వారు ఒకే చోట కలిసి ఆనందాలు పంచుకున్నారు

# కె.సి.ఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**తెలంగాణ రాష్ట్ర సాధకులుతెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె.సి.ఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు.ఒక్కడిగా బయలు దేరి శూన్యంలో సునామీ సృష్టించి తెలంగాణ రాష్ట్రం సాధించిన మాజీ ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ఎడారిని తలపించిన తెలంగాణ రాష్ట్రాన్ని పచ్చని పంట పొలాలుగా మార్చిన కె.సి.ఆర్ కృషిని గుర్తుచేసే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని నిరంజన్ రెడ్డి ఈ సందర్భంగా జిల్లా,పట్టణ,మండల,గ్రామ అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు ప్రతి పట్టణ, మండల, గ్రామాలలో వృక్షార్చాన చేపట్టి విరివిగా మొక్కలు నాటి మరో హరితహారానికి శ్రీకారం చుట్టాలని,,సేవా కార్యక్రమాలు రక్తదాన శిబిరాలు,అన్నప్రసాద వితరణ,దేవాలయాలలో, చర్చి,మసీదుల్లో ప్రార్థనలు చేపట్టాలని నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండలం అధ్యక్షులు అంబటి కనకయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.




**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** కమాన్ పూర్ మండలం కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే , డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జ్ఞాన మాల కార్యక్రమం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండలం అధ్యక్షులు అంబటి కనకయ్య ఆధ్వర్యంలో జరిగినది. కార్యక్రమానికి బి సి సంఘాల నాయకులు నల్లవెల్లి శంకర్, రంగు సత్యనారాయణ, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు దాసరి రామస్వామి, పోనగంటి రాజనర్సు, దాసరి రాంచందర్ లు ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ కార్యక్రమము ముఖ్య ఉద్దేశం భారత రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని 76వ సంవత్సరంలో అడుగు పెట్టిన శుభ తరుణంలో జ్ఞాన మాల నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినా ప్రతి ఒక్కరికి పేరు పేరు నా అంబటి కనుకయ్య కృతజ్ఞతలు తెలిపినారు. ఆనంతరం సామాజిక సేవ చేస్తున్నటువంటి మధ్యతరగతి కుటుంబానికి చెందిన గన్నేవరపు రాయమల్లును ఆల్ ఇండియా అంబెద్కర్ యువజన సంఘం మండలం కమిటి ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సుంచు శ్రీనివాస్, రెడ్డి శేఖర్, మైనార్టీ నాయకులు భాష, సిద్దు, రెబల్ రమేష్, జంగ సతీష్, మట్ట నర్స య్య, జంగాపల్లి తిరుపతి, జంగపల్లి లక్ష్మణ్, జంగపల్లి శ్రీనివాస్, కొమ్ము సమ్మయ్య, మట్ట రాజయ్య, ఆరెల్లి పీరయ్య, రాజు, బోగే శ్రీహరి, కూనమల్ల రాజనర్సు, ఆర్యవైశ్య మండలం మాజీ అధ్యక్షులు తాటిపల్లి శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# వనపర్తిలోపలు వివాహాలకు హాజరైనమాజీ మంత్రి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** వనపర్తి కళ్యాణ్ సాయి గార్డెన్స్ లో కొండ గోపాల్ రెడ్డి, నిర్మలమ్మ ల కూతురు స్వరూపరెడ్డి కి సంతోష్ రెడ్డితో వివాహాము జరిగింది ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించి, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆర్ జి గార్డెన్ లో అపర్ణ రెడ్డి రాకేష్ రెడ్డి ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన వెంటగట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ చిట్యాల రాము. తదితరులు పాల్గొన్నారు.

# కొండా వారి పెళ్లికి హాజరైన చిన్నారెడ్డి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** వనపర్తి కళ్యాణ్ సాయి గార్డెన్స్ లో కొండ గోపాల్ రెడ్డి, నిర్మలమ్మ ల కూతురు స్వరూపరెడ్డి కి సంతోష్ రెడ్డితో వివాహాము జరిగింది ఈ వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించి, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వనపర్తిలో పలు వివాహాలకుహాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయనవెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తూరు నిలవర్ధన్ రెడ్డి, సాయి కిరణ్, శ్యామ్ సుందర్ రెడ్డి, వనపర్తి మండల కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులున్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

### మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు తలసాని కృష్ణారెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామంలో శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్ర ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది అనంతరం నిర్వహణ కమిటీ సభ్యులు వారికి ప్రత్యేక దర్శనం కల్పించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో పూజ కార్యక్రమాలు నిర్వహించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ చైర్మన్ కంకల శ్రీశైలం, మాజీ వార్డు సభ్యులు డొక్కా లింగం, గౌసుద్దీన్, గొడుగు చంద్రశేఖర్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, తాంద్ర తిరుపతయ్య, ఆవ ఐలేను, మల్లారెడ్డి, గొడుగు లక్ష్మయ్య,గంజి రమేష్, ఆంజనేయులు, వెంకటయ్య, యువజన నాయకులు వట్టపు కిషోర్, మార్చల్ల శ్రీనివాసులు, పలుస శ్రీకాంత్ గౌడ్, రాజు గౌడ్, రామకృష్ణ, రమేష్, అల్లుడు కృష్ణ, రాము గౌడ్, శరత్, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గణనాథునికి ఘనంగా పూజలు

### సంకటాలు తొలగించే సంకష్ట హర చతుర్ధి



**అగ్నిధార న్యూస్ మంథని :** గణనాథుని పూజిస్తే అంతా శుభం జరుగుతుంది. అలాగే దైనందిన జీవితంలో మానవులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ సంకష్టహర చతుర్ధి దీక్షతో తొలగిపోతాయని శాస్త్రాల్లో చెప్పబడింది. ప్రతి మనిషి తన దై జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధికమించడానికి సంకష్టహర చతుర్థి రోజున ఉపవాస దీక్ష చేపట్టడం అనాదిగా పాటిస్తున్న నియమం. సంకష్టహర చతుర్థి రోజున శ్రీ విఘ్నేశ్వరుని పూజించి ఆలయంలో 21 ప్రదక్షిణాలు చేస్తే అన్ని సంకటాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మంథని పట్టణంలోని శ్రీ మహా గణపతి దేవాలయంలో సిద్ధి, బుద్ధి సమేతంగా కొలువుతీరిన గణనాథున్ని సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని ఆదివారం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితి తిథి రోజున సంకష్టహర చతుర్థి వస్తుంది. చంద్రోదయం అనంతరం స్వామివారి పూజ చేసి భోజనం చేయడం ఎంతో శ్రేయష్కారం. సంకష్టహర చతుర్థి రోజున ఉపవాస దీక్ష స్వీకరిస్తే జీవితంలో ఎదుర్కొంటున్న విఘ్నాలన్ని తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా శ్రీ మహాగణత దేవాలయాన్ని ఎంతో అందంగా అలంకరించారు. దేవతలలో మొట్టమొదట పూజించబడే ఎంతో విశిష్టత కలిగిన శ్రీ విఘ్నేశ్వరున్ని పూజించడం వల్ల అన్ని కష్టాలు తొలగిపోయి అంతా శుభం జరుగుతుందనే విశ్వాసంతో సంకష్టహర చతుర్థి దీక్షను స్వీకరిస్తారు.సంకష్టహర చతుర్థి రోజున విఘ్నేశ్వరునికి ఇష్టమైన గరిక ( దూర్వాలు ) సమర్పించడం అలాగే 21 ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే విఘ్నేశ్వరునికి ప్రీతిపాత్రలవుతారు అని శాస్త్రాల్లో చెప్పబడింది. ఈ రోజున చంద్రోదయం అనంతరం భోజనం చేయడం ఈ దీక్షలో ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఆలయ పూజారి పల్లి రాము భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

# గర్భిణీ స్త్రీకి రక్తదానం చేసిన యువశక్తి ఫౌండేషన్

### బ్లడ్ బ్యాంక్ లో బ్లడ్ లేకపోవడంతో ఆందోళనలో కుటుంబ సభ్యులు

### రక్తదానం -ప్రాణదామే యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు కాగితాల



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణీ స్త్రీకి సకాలంలో రక్తదానం చేశామని రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టే అని వనపర్తి జిల్లా యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు తెలిపారు. వివరాల్లోకి వెళితే వనపర్తి జిల్లా గాంధీనగర్ కాలానికి చెందిన మల్లిక డెలివరీ కోసం జిల్లా ఏరియా హాస్పిటల్ లో అడ్మిట్ అవ్వడం జరిగింది. రక్తహీనత కారణంగా ఆమెకు బ్లడ్ తక్కువగా ఉంది.వెంటనే ఏ పాజిటివ్ బ్లడ్ ఎక్కించాలి లేకపోతే ఆమె ప్రాణాలకు ప్రమాదం అని డాక్టర్స్ చెప్పడంతో బ్లడ్ కోసం అన్ని బ్లడ్ బ్యాంకు లలో ఎంత ఎంత వెతికిన లేకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ ని ఆశ్రయించడంతో స్పందించిన యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు వెంటనే జిల్లా కేంద్రానికి చెందిన సంతోష్ కు సమాచారం ఇవ్వడంతో మానవత్వ హృదయంతోజిల్లా కేంద్రంలో ఉన్న న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంకు లో నిండు గర్భిణీకి రక్త దానం చేశారు.ఈ కార్యక్రమం లో యువశక్తి ఫౌండేషన్ మెంబెర్ రక్తధాత సంతోష్,కుటుంబ సభ్యులు, ల్యాబ్ టెక్నిసియన్స్ పాల్గొన్నారు.

సోమవారం 17 ఫిబ్రవరి 2025
అగ్నిధార



# ఛావా' సినిమా చూసి కన్నీళ్లతో ప్రేక్షకులు

బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్ రష్మిక జోడీగా నటించిన చిత్రం 'ఛావా'.. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో ఆయన భార్యగా, మహారాణి యేసుబాయిగా రష్మిక మందన్న నటించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 14న విడుదలైన ఈ మూవీ కేవలం రెండు రోజుల్లోనే రూ. 86 కోట్లు రాబట్టింది. 1689 సమయంలో మొఘల్ చక్రవర్తి ఔరం గజేబు మరాఠా సామ్రాజ్యంపై దండెత్తిన సమయంలో తమ రాజ్యాన్ని కాపాడుకోవడానికి వారు చూపిన ధైర్యసాహసాలను కళ్ళకు కట్టినట్లు దర్శకుడు చూపారు. ముఖ్యంగా క్లైమాక్స్ సీన్స్ చూసిన ప్రేక్షకుల కంటతడి పెట్టుకుంటున్నారు. చాలా ఎమోషనల్‌గా తమ అభిప్రాయాన్ని సోషల్‌మీడియా వేదికగా పంచుకుంటున్నారు. మూవీ చూసిన వారిలో ఎక్కువ భాగం కన్నీళ్లతోనే బయటకు వస్తున్నారు. థియేటర్‌లోనే శంభాజీ మహారాజ్‌ను గుర్తు చేసుకుంటూ కేకలు వేస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. అందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# సాయిపల్లవికి ముద్దు పెట్టిన అభిమాని.. బాషా రేంజ్ ఎలివేషన్

కథానాయిక సాయిపల్లవి ఎంచుకునే కథలు వేటికవే విభిన్నంగా ఉంటాయి. ఏవి పడితే అవి చేసుకుంటూ పోకుండా ప్రాధాన్యమున్న పాత్రల్ని మాత్రమే చేసుకుంటూ వస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల తండేల్ సినిమా చేసింది. ఇందులో మరోసారి తన నటనతో కట్టిపడేసింది. ఇప్పటికే ఈ మూవీ వంద కోట్ల క్లబ్‌లో చేరింది.

సెల్ఫీ దిగాక..

ఇకపోతే తండేల్ ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ఓ ఈవెంట్‌లో జరిగిన చిన్న సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విడుదలకు ముందు జరిగిన తండేల్ జాతర ఈవెంట్‌లో ఓ మహిళా అభిమాని ఎలాగోలా సాయిపల్లవిని చేరుకుంది. తనతో సెల్ఫీ దిగిన అమ్మాయి హీరోయిన్ షేక్‌హ్యాండ్ ఇచ్చింది. దీంతో తెగ సంతోషపడిపోయిన ఆమె సాయిపల్లవి చేతికి ముద్దు పెట్టింది. ఈ వీడియో ఆలస్యంగా వెలుగులోకి రాగా సోషల్ మీడియాలో వైరలవుతోంది. బాషా సినిమాలో రజనీకాంత్ మాణిక్ బాషాగా మారిన సమయంలో తన అనుచరులంతా కూడా ఆయన చేతిని ముద్దాడుతుంటారు. ఆ సీన్‌తో సాయిపల్లవి క్లిప్‌ను పోలుస్తూ బుజ్జితల్లికి బాషా రేంజ్ ఎలివేషన్ ఇస్తున్నారు. ఇకపోతే సాయిపల్లవి ప్రస్తుతం రామాయణ సినిమాలో నటిస్తోంది. ఇందులో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తున్నాడు.



# బిగ్గెస్ట్ మైల్‌స్టోన్ చేరుకున్న 'తండేల్'.. నాగచైతన్యకు ఫస్ట్ సినిమా

తండేల్ సినిమా మరో అరుదైన విజయాన్ని సొంతం చేసుకుంది. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్‌తో రికార్డ్ క్రియేట్ చేసింది. నాగచైతన్య, సాయిపల్లవి నటించిన ఈ చిత్రాన్ని చందు మొండేటి తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మించారు. ముఖ్యంగా దేవీశ్రీ ప్రసాద్ సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సాధించిన తండేల్ సినిమా 100 కోట్ల క్లబ్‌లో చేరింది. నాగ చైతన్య కెరీర్‌లో వంద కోట్ల మొదటి చిత్రంగా నిలిచింది. తండేల్ సినిమా కేవలం 10 రోజుల్లోనే రూ. 100 కోట్ల గ్రాస్ దాటింది. ఇదే విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఫిబ్రవరి 7న థియేటర్లలో రిలీజ్ అయిన తండేల్.. మొదటి రోజు నుంచే కలెక్షన్ల స్పీడ్ చూపింది. ఈ చిత్రం %ఎణ% వెర్షన్ సినిమా విడుదలైన మొదటి రోజే లీక్ అయింది. పైరసీ ఆందోళనలు పెద్ద ఎత్తున తలెత్తాయి. అయితే అలాంటి అవాంతరాలని కూడా దాటుకొని వందకోట్ల క్లబ్‌లో చేరడం మామూలు విషయం కాదు. ఓవర్సీస్‌లో 1 మిలియన్ దాటింది. ఈ చిత్రం డొమస్టిక్ మార్కెట్లో అద్భుతంగా రాణించడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల్లోని డిస్ట్రిబ్యూటర్స్‌కు లాభదాయకమైన వెంచర్ అయ్యింది. ఇప్పటికే బ్రేక్‌ఈవెన్ అయి లాభాలు తెచ్చిపెట్టింది. పద్నాలుగు నెలలు పాకిస్తాన్ జైలులో మగ్గిపోయిన 22 మంది మత్స్యకారుల వలస జీవితం ఇతివృత్తంగా తెరకెక్కించిన 'తండేల్' చిత్రానికి ప్రేక్షకులు క్యూ కట్టేశారు.. శ్రీకాకుళం,విజయనగరం , తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన మత్స్యకారులు పాక్ నుంచి ఎలా విడుదలయ్యారనే అంశాన్ని ఉన్నది ఉన్నట్లు సినిమాలో చూపలేదని వారు వాపోయిన విషయం తెలిసిందే.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com